# హైదరాబాద్‌కు జలగండం

మొదటిపేజీ తరువాయి...

ఇచ్చారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ తాగునీటి సరఫరా కొనసాగేందుకు జలమండలి ప్రత్యామ్నాయం చూసుకోనేలా చర్యలు తీసుకోవాలని లేఖలో ఈఎన్‌సీ ప్రభుత్వానికి సూచించారు.

### ప్రత్యామ్నాయం ఉందా?!

ఇలాంటి అనుకోని ఇబ్బందులు ఎదురవుతాయనే ముందుచూపుతోనే కేసీఆర్ ప్రభుత్వం సుంకిశాల పథకాన్ని చేపట్టింది. 80 శాతానికిపైగా పనులు పూర్తిచేశారు. ఈ పథకం అందుబాటులోకి వస్తే ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుతో సంబంధం లేకుండా నాగార్జునసాగర్ జలాశయం నుంచి నేరుగా కృష్ణాజలాలను తోడుకునే అవకాశం ఉండేది. జలమండలితో పాటు నిర్మాణ సంస్థ మేఘా తప్పిదంతో ఈ బృహత్తర పథకం పనులు గత ఏడాది ఆగస్టులో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కార్మికుల కండ్ల ముందే రిటెయినింగ్ వాల్ నిట్టనిలువునా కుప్పకూలింది. ఫలితంగా హైదరాబాద్‌కు కృష్ణాజలాలు తరలించే ప్రత్యామ్నాయ మార్గం మూసుకుపోయింది. నిర్ణీత గడువు ప్రకారం గత డిసెంబర్‌లో ఈ పథకం అందుబాటులోకి వచ్చి ఉంటే నగర నీటి సరఫరాకు ఈ గండం పొంచి ఉండేది కాదు. ముఖ్యంగా ఘటన జరిగినప్పుడు రెండు నెలల్లోనే పనులు పునరుద్ధరిస్తామంటూ నిర్మాణ సంస్థతోపాటు సాక్షాత్తూ ముగ్గురు మంత్రులు ప్రకటించి నాలుగు నెలలు గడిచినా ఇప్పటివరకు పనులు పునరుద్ధరించేందుకు కించిత్తు అవకాశం కూడా లేదు.

### హైదరాబాద్ అవసరాల్లో కృష్ణా జలాల వాటా 48%

హైదరాబాద్‌కు తాగునీటిని అందించేందుకు జలమండలి.. కృష్ణా, గోదావరి, సింగూరు-మంజీరా, జంట జలాశయాల నుంచి రోజుకు సుమారు 565 మిలియన్ గ్యాలన్ల నీటిని తరలిస్తున్నది. ఇందులో కేవలం కృష్ణా జలాలే రోజుకు 270 మిలియన్ గ్యాలన్లు (ఏడాదికి 16.5 టీఎంసీలు). అంటే నగరానికి

సరఫరా అవుతున్న మంచినీటి పరిమాణంలో కృష్ణాజలాల వాటా దాదాపు సగం (48%). ఇంతటి కీలకమైన జలాల తరలింపు ప్రక్రియ నల్లగొండ జిల్లాలోని ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు (ఏఎమ్మార్పీ) ఆధారంగా జరుగుతుంది. పుట్టంగండి వద్ద నాగార్జునసాగర్ జలాశయం ఫోర్‌షోర్ నుంచి ఈ ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసుకొని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నిల్వ ఉంచుతారు. అక్కడినుంచి సమీపంలోని కోదండాపూర్ నీటి శుద్ధి కేంద్రానికి తరలించుకొని వివిధ దశల్లో శుద్ధి చేసి నగరానికి సరఫరా చేస్తున్నారు. అంటే ఏఎమ్మార్ ప్రాజెక్టులోని మోటర్ల నుంచి నీటిని లిఫ్టు చేస్తే తప్ప హైదరాబాద్‌కు కృష్ణాజలాల తరలింపు కుదరదు. అయితే, ఇప్పుడు ఈ ప్రాజెక్టులోని పలు కీలక నిర్మాణాలకు శాశ్వత మరమ్మతులు చేయడం అనివార్యంగా మారిందని నీటిపారుదల శాఖ ఇంజినీర్లు గుర్తించారు.

### సిస్టర్న్‌కు పొంచి ఉన్న ముప్పు?

ఏఎమ్మార్ ప్రాజెక్టులో భాగంగా పుట్టంగండి వద్ద నాగార్జునసాగర్ జలాశయం నుంచి కృష్ణాజలాలను మోటర్ల ద్వారా సిస్టర్న్ (చిన్న జలాశయం)లోకి ఎత్తిపోస్తారు. అక్కడినుంచి 9.26 కిలోమీటర్ల లింక్ కెనాల్ ద్వారా నీటిని హైదరాబాద్-సాగర్ హైవేకు సమీపంలోని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి తరలిస్తారు. ఆ రిజర్వాయర్ నుంచి జలమండలి అధికారులు ఒక పైప్‌లైన్ ద్వారా రోజుకు 330 క్యూసెక్కుల నీటిని కోదండాపూర్ నీటిశుద్ధి కేంద్రానికి తీసుకుంటారు. అయితే, ఏఎమ్మార్ ప్రాజెక్టులోని సిస్టర్న్ వద్ద లీకేజీలు ఏర్పడ్డాయి. ప్రాజెక్టు ప్రారంభం నుంచీ ఇవి ఉన్నప్పటికీ పలుమార్లు మరమ్మత్తులు చేశారు. అయినప్పటికీ భారీ వర్షాల కారణంగా సిస్టర్న్ రిజర్వాయర్ వాల్ పలుచోట్ల కూలిపోగా ఇసుక బస్తాలు వేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టినట్టు ఈఎన్‌సీ తన లేఖలో పేర్కొన్నారు. అనంతరం పలుసార్లు ఇంజినీర్లు పరిశీలించగా సిస్టర్న్‌కు శాశ్వత మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉన్నదని నివేదిక ఇచ్చినట్టు తెలిపారు. దీంతోపాటు సిస్టర్న్ నుంచి అక్కంపల్లి రిజర్వాయర్ వరకు ఉన్న 9.26 కిలోమీటర్ల లింక్‌కెనాల్ కూడా పలుచోట్ల దెబ్బతినగా, అక్కడ తాత్కాలిక మరమ్మతులు చేసినా, శాశ్వత మరమ్మతులు చేయాల్సి ఉన్నదని పేర్కొన్నారు. ప్రాజెక్టులో ఈ రెండు కీలకమైన నిర్మాణాలు అని, వీటిపైనే మూడు లక్షల ఎకరాల ఆయకట్టుతోపాటు హైదరాబాద్ తాగునీరు, మిషన్ భగీరథ కూడా ఆధారపడి ఉన్నదని వివరించారు.

### ప్రత్యామ్నాయం చూసుకోండి

సిస్టర్న్, లింక్ కెనాల్‌కు మరమ్మతులు చేయాల్సి ఉన్నందున జలమండలి అధికారులను ప్రత్యామ్నాయం చూసుకునేలా చర్యలు తీసుకోవాలని ఈఎన్‌సీ తన లేఖలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు పుట్టంగండి నుంచి అక్కంపల్లి రిజర్వాయర్ వరకు ప్రత్యేక పైప్‌లైన్ వేసుకోవాలని సూచించారు. దీని కోసం భూసేకరణ చేయాల్సిన అవసరంలేదని, లింక్‌కెనాల్ వెంట పైప్‌లైన్ ఏర్పాటు చేయవచ్చని తెలిపారు. సిస్టర్న్‌కు గండిపడితే దిగువన ఉన్న పంప్‌హౌస్‌కు పెను ప్రమాదం ఉంటుందని ఈఎన్‌సీ తన లేఖలో ప్రస్తావించారు. మరమ్మతులకు మూడు నెలల సమయం పడుతున్నందున ఆ మేరకు ప్రత్యామ్నాయం చేసుకోవాలని సూచించారు. రానున్న వేసవిలో శాశ్వత మరమ్మతులు చేస్తేనే వచ్చే వానకాలం సీజన్‌కు ఏఎమ్మార్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసి, నల్లగొండ జిల్లాలోని దాదాపు 200 చెరువులను నింపే అవకాశం ఉంటుందని స్పష్టంచేశారు.

### సుంకిశాలలో నాలుగు నెలలైనా అదే పరిస్థితి

హైదరాబాద్ తాగునీటికి కేసీఆర్ ప్రభుత్వం శాశ్వత పరిష్కారంగా చూపిన సుంకిశాల పథకంలో గత ఏడాది ఆగస్టు మొదట్లో రిటెయినింగ్ వాల్ కుప్పకూలి, సొరంగాలన్నీ నీటమునిగాయి. ఈ క్రమంలో నిర్మాణ సంస్థతో పాటు అప్పుడు అక్కడ పర్యటించిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు రెండు నెలల్లో పనులు మొదలవుతాయని ప్రకటించారు. కానీ ఇప్పటికి నాలుగు నెలలు గడిచినా అక్కడ కించిత్తు పునరుద్ధరణ పనులు మొదలు కాలేదు. ముఖ్యంగా పంపుహౌస్‌లో అప్పుడు ఏస్థాయిలో నీటిమట్టం ఉన్నదో.. ఇప్పుడు కూడా అదేస్థాయిలో నీటిమట్టం ఉన్నట్టు తెలిసింది. గతంలో ఆ తప్పిదం జరగకపోయి ఉంటే గత ఏడాది డిసెంబర్‌లోనే సుంకిశాల పథకం అందుబాటులోకి వచ్చేది. ఇప్పుడు ఏఎమ్మార్ ప్రాజెక్టులో మరమ్మతులు జరిగినా సాఫీగా సుంకిశాల నుంచి కృష్ణా జలాల తరలింపు జరిగేది.

## గొడ్డుకారమే పౌష్టికాహారమా?

**ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్**

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజాపాలనలో విద్యార్థులకు ఉప్పు, కారంపొడి, బియ్యమే పౌష్టికాహారంగా అందిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. 'ముఖ్యమంత్రి తినే ఒక ప్లేట్ భోజనం ఖర్చు రూ.32 వేలు మాత్రమే.. చదువుకునే పేద విద్యార్థులకు మాత్రం గొడ్డుకారం.. శభాష్ ఇందిరమ్మ రాజ్యం.. వారెవ్వా ప్రజాపాలన' అంటూ బుధవారం ఎక్స్ వేదికగా విమర్శించారు. నల్లగొండ మహాత్మా గాంధీ యూనివర్సిటీలోని కృష్ణవేణి హాస్టల్‌లో టిఫిన్‌కు కారంపొడి పెడుతున్న ఫొటోలను జతచేశారు. ఉత్తరప్రదేశ్‌లో ఇదే తరహా ఘటన జరిగినప్పుడు స్పందించిన కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ప్రియాంకాగాంధీ ఇప్పుడు స్పందించరా? అని ప్రశ్నించారు. యూపీలో జరిగితేనే జాతీయ సమస్యగా మారుతుందా? వేరే రాష్ట్రంలో జరిగితే కాదా? అని నిలదీశారు. తెలంగాణ కాబట్టి కారం తీవ్రత, సమస్య తీవ్రత తగ్గుతుందని మీరనుకుంటున్నారా?' అంటూ ట్వీట్ చేశారు.

## ప్రయాగ్‌రాజ్‌కు శ్రీవారి కల్యాణరథం

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): యూపీ ప్రయాగ్‌రాజ్‌లో ఈ నెల 13న ప్రారంభంకానున్న మహా కుంభమేళా నేపథ్యంలో బుధవారం తిరుమల నుంచి శ్రీవారి కల్యాణరథం బయల్దేరింది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి రథానికి ప్రత్యేక పూజలు చేసి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఫిబ్రవరి 26 వరకు జరగనున్న కుంభమేళాలో సెక్టార్-6 బజరంగ్‌దాస్ రోడ్డులోని నాగవాసుకి ఆలయం సమీపంలో యూపీ ప్రభుత్వం కేటాయించిన స్థలంలో శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

## ఫుడ్‌పాయిజన్ ఘటనపై నివేదిక ఇవ్వండి

**కరీంనగర్ కలెక్టర్‌కు బీసీ కమిషన్ ఆదేశం**

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): గురుకులంలో ఫుడ్‌పాయిజన్ ఘటనపై రాష్ట్ర బీసీ కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఘటనపై సమగ్ర నివేదిక అందించాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. కరీంనగర్‌లోని శర్మనగర్ జ్యోతిబాపూలే బీసీ హాస్టల్‌లో ఫుడ్‌పాయిజన్ జరిగి విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై మీడియాలో కథనాలు రావడంతో బీసీ కమిషన్ స్పందించింది. మూడు రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని కరీంనగర్ కలెక్టర్‌ను బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ఆదేశించారు.

# హాస్టల్‌లో ఐదుగురికి ఫుడ్‌పాయిజన్

## కరీంనగర్ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో ఘటన

తిమ్మాపూర్, జనవరి 8: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో ఐదుగురు విద్యార్థులు కిచిడీ, చారు తిని అస్వస్థతకు గురయ్యారు. ఎల్ఎండీ కాలనీలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఉంటూ పక్కనే ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు చదువుకుంటున్నారు. వీరు బుధవారం హాస్టల్‌లో టిఫిన్ చేసి స్కూల్‌కు వెళ్లారు. అక్కడ మధ్యాహ్నం భోజనం చేసి, మళ్లీ సాయంత్రం హాస్టల్‌కు వచ్చారు. కిచిడీ, చారుతో భోజనం చేశారు. ఈ క్రమంలో ఐదుగురు విద్యార్థులకు విరేచనాలు కావడంతో స్థానికంగా మందులు వేయించారు. అందులో 8,9వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు అరణ్య, కళ్యాణి, నందినికి తీవ్రంగా విరేచనాలు కావడంతో

కరీంనగర్ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

పాటు కడుపు నొప్పి రావడంతో హాస్టల్ సిబ్బంది కరీంనగర్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. హాస్టల్ ఫుడ్ వల్ల అస్వస్థత కలుగలేదని, పాఠశాలలో తిన్న భోజనం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని హాస్టల్ సిబ్బంది చెప్తున్నారు. విషయం తెలుసుకుని విద్యార్థినుల తల్లిదండ్రులు దవాఖానకు చేరుకుని ఆందోళన చెందారు. మిగిలిన విద్యార్థుల తల్లిదండ్రులు సైతం క్షేమ సమాచారం తెలుసుకున్నారు.

## ఆత్మహత్యలకు పాల్పడవద్దు

**హక్కులను పోరాడి సాధించుకుందాం: దేవీప్రసాద్**

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని, హక్కులు, బెనిఫిట్స్‌ను పోరాడి సాధించుకుందామని ఉద్యోగ సంఘాల జాక్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ సూచించారు. దాదాపు 8,000 మంది ఉద్యోగులకు రావలసిన పెన్షన్ బెనిఫిట్స్ అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్నట్టు మహబూబ్‌నగర్ జిల్లా రిటైర్డ్ ఏఆర్ ఎస్సై ఎండీ సాదిక్ చెప్పడం అందరినీ తీవ్రంగా కలచివేసిందని వెల్లడించారు. సమస్యలను పరిష్కరించుకుందామని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని దేవీప్రసాద్ డిమాండ్ చేశారు.

## రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంట

- వీడియోలో రిటైర్డ్ ఏఆర్ ఎస్సై సాధిక్ హెచ్చరిక
- 8 నెలలుగా డబ్బుల కోసం ఎదురుచూపు
- సీఎంకు చేరే వరకు వైరల్ చేయాలని వేడుకోలు

వీడియోలో ఆవేదన వ్యక్తంచేస్తున్న సాధిక్

మహబూబ్‌నగర్, జనవరి 8 : ఎనిమిది నెలలైనా బెనిఫిట్స్ రావడం లేదని.. ఈ పరిస్థితుల్లో తాను ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరో మార్గం లేదని రిటైర్డ్ ఏఆర్ ఎస్సై సాధిక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన తీసిన వీడియో సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో బుధవారం వైరల్ అయ్యింది. 'నేను రిటైర్ అయి 8 నెలలైంది. ప్రభుత్వం నుంచి ఇంకా డబ్బులు రాలేదు. నేను ప్రైవేట్ ఫైనాన్స్‌లో హౌసింగ్ లోన్ తీసుకున్నాను. విధి నిర్వహణలో ఉండగా.. తోటి ఉద్యోగుల వద్ద కొంత అప్పు చేసిన. ఉద్యోగ విరమణ వచ్చే బెనిఫిట్స్ డబ్బులు వారికి చెల్లిద్దామనుకున్నా. కానీ నేటికీ పైసలు రాలేదు. వారికి వడ్డీ కూడా కట్టలేకపోతున్నా. వచ్చే పెన్షన్ కుటుంబ పోషణకే సరిపోతున్నది. బెనిఫిట్స్ కోసం ఎదురుచూసి ఆశ వదులుకొని చనిపోవాలనుకుంటున్నా. నేను చస్తే కాని ప్రభుత్వం డబ్బులు ఇచ్చేలా లేదు. రైతు మరణిస్తే అప్పటికప్పుడు రూ.5 లక్షలు ఇస్తున్నారు. దయచేసి ఈ వీడియో అందరికీ షేర్ చేయండి.. సీఎం రేవంత్‌కు చేరే వరకు వైరల్ చేయండి. ప్రతి ఒక్కరి గురించి మాట్లాడుతున్నారు.. కానీ గవర్నమెంట్ సర్వెంట్ల గురించి.. రిటైర్ అయిన వారి తరపున ఎవరూ మాట్లాడం లేదు. డబ్బుల కోసం అప్పుల వారు ఇంటికి వస్తున్నారని నేను ఊర్లు తిరుగుతూ దాక్కుంటున్నా. ఇలాంటి దుస్థితి వచ్చింది నాకు. ఏం చేయాలో తోచక వీడియో తీసిన. నేను చనిపోతే నా కొడుక్కు పైసలు ఇస్తేనేమో తీసుకోండి. లేకపోతే నన్ను క్షమించండి.. చేతులు జోడించి వేడుకుంటున్నా'.. అని మనస్తాపంతో వీడియో తీశాడు.

### బెనిఫిట్స్ ఇప్పిస్తానని ఎస్సీ హామీ

ఆర్థిక సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకుంటానని సాధిక్ సోషల్ మీడియాలో పెట్టిన వీడియో ఎస్సీ కార్యాలయానికి చేరింది. దీంతో ఎస్సీ జానకి బుధవారం అతడిని పిలిపించి మాట్లాడారు. అతడి సమస్యను తెలుసుకొని రావాల్సిన బెనిఫిట్స్‌ను అందజేస్తామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

## పోలీసులకే భద్రత కరువు

- రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక ఉద్యోగుల తిప్పలు
- నెట్‌వర్క్ దవాఖానలకు సకాలంలో బిల్లులు చెల్లించాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): ప్రజలను కాపాడిన పోలీసులకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో భద్రత కరువైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఏఎస్ఐగా పనిచేసి ఎనిమిది నెలల క్రితం రిటైరైనా, తనకు రావాల్సిన బెనిఫిట్స్ రాలేదని, ఇక తనకు ఆత్మహత్యే శరణ్యం అని ఆవేదన చెందిన సాదిక్ అలీ ఉదంతాన్ని ఆయన ఉదహరించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సర్కార్ తీరుపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. సాదిక్ అలీ ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. రేవంత్ పాలన అన్ని వర్గాలతోపాటు రిటైర్డ్ ఉద్యోగులకు శాపంగా మారిందని మండిపడ్డారు. విశ్రాంత జీవితాన్ని కుటుంబసభ్యులతో కలిసి సంతోషంగా గడపాల్సిన రోజుల్లో వారిని మానసిక క్షోభకు గురిచేయడం హేయమైన చర్య అని దుయ్యబట్టారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు ఏడువేల మంది ప్రభుత్వ ఉద్యోగులు వారికి హక్కుగా దక్కాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఏడాదిగా ఎదురుచూస్తున్నా పట్టించుకోకపోవడం సర్కార్ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. కోర్టుకు వెళ్లి ఆర్డర్ తెచ్చుకుంటేగాని రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందలేని దుస్థితికి విశ్రాంత ఉద్యోగులను నెట్టడం శోచనీయమని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా రిటైర్మెంట్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బెనిఫిట్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. విజయవంతంగా ఉద్యోగాలు పూర్తిచేసి, జీవితంలో విజయం సాధించామని ఆత్మహత్యలు పరిష్కారం కాదని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలుగా అండంగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

### నెట్‌వర్క్ దవాఖానలకు బిల్లులేవి?

నెట్‌వర్క్ దవాఖానలకు బిల్లులు చెల్లించక ఉద్యోగులకు, జర్నలిస్టులకు, పోలీసులకు వైద్యం అందించే ఈహెచ్ఎస్, ఈజేహెచ్ఎస్, ఆరోగ్య భద్రత పథకాల సేవలను సైతం అటకెక్కించే పరిస్థితి నెలకొన్నదని హరీశ్‌రావు ఆందోళన చెందారు. సర్కార్ నిష్క్రియాపరత్వం కారణంగా అత్యవసర వైద్యసేవలు అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా కండ్లు తెరిచి వెంటనే బకాయిలు చెల్లించి, ఉద్యోగులు, జర్నలిస్టులు, పోలీసులకు వైద్యసేవలు కొనసాగేలా చూడాలని డిమాండ్ చేశారు.

# ..ఆరుగురు దుర్మరణం

టోకెన్ల కోసం ముందుకు దూసుకొస్తున్న భక్తులు, కట్టడి చేస్తున్న పోలీసులు

మొదటిపేజీ తరువాయి...

ఏర్పాటు చేసిన 94 కౌంటర్ల ద్వారా జారీచేయాలని టీటీడీ అధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రమే భక్తులు భారీగా తిరుపతికి చేరుకున్నారు. భక్తులను బైరాగిపట్టెడ వద్ద పద్మావతి పార్కులో ఉంచారు. టోకెన్ల కేంద్రంలోని సిబ్బందిలోని ఒకరు అస్వస్థతకు గురికావడంతో దవాఖానకు తరలించేందుకు క్యూలైన్ తెరిచారు. టోకెన్లు జారీ చేసేందుకే క్యూలైన్ తెరిచారని భావించిన భక్తులు ఒక్కసారిగా దూసుకొచ్చారు. తమిళనాడు సేలంకు చెందిన మహిళ విష్ణు నివాసం వద్ద టోకెన్లు తీసుకునేందుకు ప్రయత్నించారు. భక్తుల మధ్య ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. గాయపడిన మల్లిక అనే మహిళను ముందుగా ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి రుయా దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. మిగిలిన క్షతగాత్రులను సిమ్స్, రుయాకు తరలించారు. రుయాలో చికిత్సపొందుతూ మరో ఐదుగురు భక్తులు మృతిచెందారు.

### అంచనా వేయడంలో టీటీడీ విఫలం

వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా టోకెన్ల కోసం వచ్చే భక్తులను అంచనా వేయడంలో టీటీడీ పూర్తిగా విఫలం చెందింది. ఎంతమంది భక్తులు వస్తారు? వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పించాలనే విషయంలో జాగ్రత్తలు తీసుకోలేదనే విమర్శలొస్తున్నాయి. భద్రత విషయంలో విఫలమైనట్టు ఆరోపణలున్నాయి. పద్మావతి పార్కు నుంచి క్యూలైన్‌లోకి భక్తులను ఒక్కసారిగా వదలడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని భక్తులు విమర్శిస్తున్నారు.

### అంబులెన్స్‌ల కొరత

క్షతగాత్రులను సకాలంలో దవాఖానలకు తరలించేందుకు అంబులెన్స్‌లు అందుబాటులో లేకపోవడంతో బాధిత కుటుంబసభ్యులు టీటీడీ అధికారులపై మండిపడ్డారు. వైద్య సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో వైద్యం అందకపోవడం వల్లే ముగ్గురు మృతి చెందారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గాయపడిన క్షతగాత్రులను రుయా దవాఖానకు తరలించగా, వైద్యులు పట్టించుకోలేదని బాధిత కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో క్షతగాత్రులను బంధువులు స్విమ్స్‌కు తరలించారు.

### సౌకర్యాలు కల్పించడంలో టీటీడీ విఫలం!

ఉచిత దర్శన టికెట్ల కోసం భారీగా భక్తులు తరలివస్తారని సమాచారం ఉన్నా, ఏర్పాట్లు చేయడంలో టీటీడీ వైఫల్యం చెందిందని భక్తులు మండిపడుతున్నారు. భారీగా భక్తులు కౌంటర్ల వద్దకు చేరుకోవడంతో మంగళవారం రాత్రి 12 గంటలకు ముందుగానే టోకెన్లు ఇచ్చే అవకాశాలున్నాయని భక్తులు తోసుకొచ్చారు. షామియానా కూడా ఏర్పాటు చేయకపోవడంతో చలికి వృద్ధులు, పిల్లలతో వచ్చిన భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

### తొక్కిసలాట ఘటన దురదృష్టకరం : కేటీఆర్

తిరుపతి తోపులాటలో భక్తుల మృతిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటన తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేశారు. అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

### తిరుపతి ఘటన బాధాకరం: హరీశ్‌రావు

తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు మరణించడం బాధాకరం.. దురదృష్టకరమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. మరణించిన భక్తుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని ఏపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

### తొక్కిసలాట ఘటన దిగ్భ్రాంతికరం: కవిత

తిరుపతిలోని విష్ణు నివాసం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన దిగ్భ్రాంతికరమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు.

### సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి

తిరుపతిలో తొక్కిసలాట జరిగి భక్తులు మరణించిన ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరారు.

### మోదీ, బాబు దిగ్భ్రాంతి

తిరుపతి తోపులాటలో భక్తుల మృతిపై ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని, ఘటనాస్థలంలో సహాయ చర్యలు చేపట్టాలని అధికారులకు సీఎం ఆదేశించారు.

## వైకుంఠ ఏకాదశికి తిరుమలలో ఏర్పాట్లు

**తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడి**

హైదరాబాద్, జనవరి 8 (నమస్తేతెలంగాణ): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని తిరుమలలోని ఉత్తర ద్వారం దర్శనాలకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. జనవరి 10 నుంచి 19 వరకు సుమారు 7 లక్షల మందికి ఉత్తర ద్వారదర్శనం టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేసినట్టు అధికారులు తెలిపారు. 9న ఉదయం 5 గంటల నుంచి తిరుమలలోని ప్రత్యేక కౌంటర్ల ద్వారా సర్వ దర్శనం టోకెన్లను జారీ చేయనున్నట్టు తెలిపారు. ఈ మేరకు ప్రధాన ఆలయంతోపాటు తిరుమల పరిసర ప్రాంతాలను టీటీడీ సిబ్బంది సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మొత్తం 12 వేల వాహనాలను పార్కింగ్ చేసేలా ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటుచేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో 3వేల మంది పోలీసులు, 1,550 మంది విజిలెన్స్ సిబ్బందితో పర్యవేక్షణ చేస్తున్నట్టు జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు తెలిపారు.


**రక్షణ మంత్రిత్వ శాఖ**
**భారత ప్రభుత్వం**
**డిఫెన్స్ రిసెర్చ్ & డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్**
**డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రీసెర్చ్ ల్యాబోరేటరీ (DLRL)**
**చాంద్రాయణగుట్ట, హైదరాబాద్.**

**కాంట్రాక్ట్ ప్రాతిపదికన మెడికల్ ఆఫీసర్ (MBBS) కొరకు వాక్-ఇన్-ఇంటర్వ్యూ**

1. ఒక సంవత్సర కాలానికి, అవసరాన్ని బట్టి వార్షిక ప్రాతిపదికన గరిష్టంగా రెండు సంవత్సరాలు పొడిగించబడు కాలానికి కాంట్రాక్ట్ ప్రాతిపదికన మెడికల్ ఆఫీసర్ సేవలను నియోగించు నిమిత్తం వాక్ ఇన్ ఇంటర్వ్యూ.
2. **అర్హత:** MB